

# చైతన్యరాహిత్యంలో స్త్రీ

## – పవని నిర్మల ప్రభావతి

పధ్నాలుగేళ్ళు అరణ్య వాసం చెయ్యటానికి బయల్దేరిన సీతారాములను లక్ష్మణుడు అనుసరించినప్పుడు అతని అర్ధాంగి ఊర్మిళ, భర్తను అనుసరించ లేకా, రాజాంతఃపురంలో జీవచ్ఛవంలా బ్రతకలేకా చైతన్య రాహిత్య స్థితిలోకి జారిపోయి దీర్ఘనిద్రను ఆశ్రయించింది.

ఆమెకా దుస్థితి కల్గించిన వారెవ్వరూ ఆమె పట్ల జాలి చూపించ లేదు.

చరిత్ర కూడా ఆమె మానసిక పరిస్థితిని విశ్లేషించలేదు.ఈనాటి అధునాతన సమాజంలో కూడా ... పరిస్థితుల ప్రభావం వల్ల కొందరు స్త్రీలు ఎటువంటి చైతన్య రాహిత్య స్థితిని ఆశ్రయిస్తున్నారంటే అందుకు కారణం ఏమిటి?

మారుతున్న సమాజంలో కూడా స్త్రీలకు ఈ దుస్థితి తప్పక పోతే, ఇహ, అందరూ ఆశిస్తున్న 'మార్పు'కు అర్ధం ఏమిటి?

నేటి సాంఘిక సమస్యలను కథా వస్తువుగా తీసుకుని అతి హృద్యమంగా మలచిన శ్రీమతి పవని నిర్మల ప్రభావతి గారి రసవత్తర నవల "చైతన్య రాహిత్యంలో స్త్రీ"

ప్రతి ఒక్కరూ తప్పక చదివి తీరాల్సిన నవల ఇది.

*(గత సంచిక తరువాయి)*

ఊర్మిళ కూడా అంతే. తన నోటి వాక్కు గురుబోధగా భావిస్తుంది. చిన్నతనం నుంచీ ఏ శలవులు వచ్చినా తలిదండ్రుల వెంట ఏ ఇతర ప్రదేశాలకూ వెళ్ళేది కాదు. "పెదనాన్నా! పెదనాన్నా!" అంటూ పరుగు పరుగున వచ్చేది. శలవులంటూ దొరికితే చాలు ఏవో యాత్రలు అంటూ టూర్ మొదలెడతారు రంగనాధం దంపతులు. ఊర్మిళ వెళ్ళదు.

సీతకు త్వరలోనే వో సంబంధం రాబోతోంది. పెళ్లిచూపులు ఏర్పాటు చేయించమని మధ్యవర్తి చెప్పాడు. సంక్రాంతి వెళ్ళగానే మంచి రోజు చూచి పెళ్లిచూపులు ఏర్పాటు చేయించాలి. సీత పెళ్ళయ్యాక ఊర్మిళకు పెళ్లి చెయ్యాలి.

ఈ రోజెందుకో ఊర్మిళకు మంత్రోపదేశం చేయాలనిపిస్తోంది, హృదయంతరాళాలలో నుంచి ఏదో ప్రేరణ వస్తోంది.

"పెదనాన్నా!" ఊర్మిళ పిలుపుతో త్రుళ్ళి పడ్డారాయన. ఆలోచనలు ఎగిరి పోయాయి.

“వచ్చావా అమ్మా! నీకోసమే ఎదురు చూస్తున్నా. ఈ రోజు అభిషేకమూ, అలంకారమూ చేశాను స్వామికి. ఇంకా సహస్ర నామార్చన ప్రారంబించలేదు. రా! గర్భగుడికి అవతలగా నిల్చుని భక్తి శ్రద్ధలతో విను” అన్నారాయన.

వైకుంఠ ఏకాదశి ఆ రోజు. ఇక తెల్లారబోయే సరికి అశేష భక్తులు వస్తారు ద్వారదర్శనానికి. రామచంద్రం ఆలయ ప్రాంగణంలోనే ఓ వేపుగా వున్న వంట గదిలో పొంగలి చేస్తున్నాడు. మరో పది నిమిషాలలో రావచ్చు, అతను కూడా నైవేద్యం సిద్దం చేసుకుని. ఆలయం పక్కనే ఒకరింట్లో పెరట్లో వున్న పారిజాత చెట్టు కింద రాలిన పారిజాతాలనీ ఏరుకు వస్తుంది ఊర్మిళ రోజూ,వారి అనుమతితో. ఈ రోజూ అలాగే ఏరుకుని వచ్చింది. మంచులో తడిసి, దివ్య పరిమళాలు వెదజల్లుతున్నాయి పారిజాతాలు.

“అమ్మా! విష్ణు సహస్ర నామం, శ్రీ లక్ష్మి నృసింహ సహస్ర నామం కూడా చేస్తాను ఈ రోజు. చాలా పూలు వున్నాయి” అన్నారు ఆచారిగారు తన్మయత్వంతో.

“సశ్యామిత్వం మహా సింహం
హరిణం వనమాలినం
కిరీటినం, కుండలినం
సర్వగం సర్వతోముఖం
సర్వతః పాణి పాదోరుం
సర్వతోక్షి శిరోముఖం
సర్వేశ్వరం సదాతుష్టం
సత్వస్త్యం సమర ప్రియం.”

భక్త్యావేశంతో ఊగిపోతూ, కంచుగంటలా మ్రోగుతున్న కంఠస్వరంతో ఒక్కో పారిజాతమూ స్వామి పాదాల మీద వేస్తూ అర్థ నిమీలిత నేత్రాలతో పూజ చేస్తున్నారు శేషాచారిగారు.

విభ్రాంతిగా చూస్తోంది ఊర్మిళ. రామచంద్రమూ అంతే!

ఈ పెదనాన్నని తానింత క్రితం చూడలేదు. ఇప్పుడక్కడ వున్నది పెదనాన్న కాదు. భక్త పోతనకీ, భక్త రామదాసుకీ, భక్త కబీరుకీ, భక్త తుకారాంకీ, భక్త గోరా కుంభార్ (చక్రధారి) కీ ... అలా ఎందరెందరో భక్త శిఖామణులందరికీ వారసుడు. వారందరి ఆత్మలనీ అంతర్లీనంగా తనలో ఐక్యం చేసుకున్న మహాభక్తుడు.

శీను అన్నయ్య ఓసారి చెప్పాడు తనకీ పెదనాన్నకీ జరిగిన సంభాషణ గురించి. సరిగ్గా అదే తాద్యాత్మ్యాన్ని ఇపుడు చూస్తోంది.

అస్తమానూ అనసూయమ్మ పెద్దమ్మ ఈ మహానుభావుణ్ణి 'లౌక్యం తెలియని' వ్యక్తిగా ఈసడిస్తూ ఉంటుంది. సీతక్క 'చాదస్తుడైన తండ్రిగా' నిర్లక్ష్యం చేస్తుంటుంది.

తను  మాత్రం... అలా ఎన్నటికీ చేయలేదు. భగవంతుని ప్రతినిధి ఈ పెదనాన్న. ఈ పెదనాన్న చేత మంత్రోపదేశం పొంద గలిగితే...

ఎదురుగా రాలి పడుతున్న పారిజాతాలు కొండలా పెరిగి స్వామి పాదాలు కప్పి వేశాయి. తర్వాత మోకాళ్ళు ఆ తర్వాత నడుము... తర్వాత ఎద, ఆ తర్వాత శంఖ చక్రాలు స్వామి ముఖం మాత్రం కనిపిస్తోంది ఇప్పుడు. దీపారాధన వెలుగులో దేదీప్య మానంగా! ఆ విశాల నేత్రాలలో అపార వారమైన కాంతి పుంజాలు, సర్వ ప్రపంచానికి వెదజల్ల బడుతున్నాయి.

పారిజాత దివ్య పరిమళాలలో, అగరువత్తుల ధూపంతో, పూల కొండ మీద స్వామి కూర్చుని వున్నట్లు అనుభూతి కలుగుతోంది.

ఊర్మిళకేదో తన్మయత్వ భావన మత్తులా ఆవరించింది. ఆచారిగారు పూజ పూర్తి చేసి, హారతి వెలిగించి నివేదన చేస్తున్నా ఆమెకా స్పృహే కలుగలేదు.

"ఊర్మిళా!" హారతి కళ్ళకద్దుకుని ఊర్మిళ వేపు చూస్తూ పిలిచారాయన .

"ఆఁ!" కలలో మనిషిలా పలికింది.

"రామచంద్రం!" అన్నారాయన.

"ఉన్నాను మామయ్యా"అన్నాడు.

ఊర్మిళ కేసి నిదానంగా చూశారాయన. అలౌకికమైన మానసిక స్థితిలో ఒకానొక దివ్య చైతన్య రాహిత్య స్థితిలో ఒకానొక సమాధి స్థితిలో ఉందామె.

'ఇదే తరుణం... మంత్రోపదేశం ఇప్పుడే జరిగి పోవాలి.' ఆయనలో నుంచి ఏదో ప్రతిధ్వని. గబగబా ఆమె పక్కకు వచ్చారు.

రామచంద్రం ఆలయం బయటకు వెళ్లి పోయాడు ఆయనగారి కనుసైగతో.

“తల్లీ! విను. మళ్ళీ మళ్ళీ నీకీ స్థితి కోరుకున్నా రాక పోవచ్చు. వచ్చినా నేనుండక పోవచ్చు. ఈ క్షణంలో సర్వాంతర్యామి సాన్నిధ్యంలో ఆయన వాక్కుగా నేను గురుబోధ చేస్తాను.”

ఆవేశంగా అన్నారాయన. మరుక్షణం ఆమె శిరసు మీద తన కుడి అరచేయి పెట్టి ఆమె చెవి దగ్గరగా వంగి ‘అష్టాక్షరి’ ముమ్మారు బోధించారు.

కలలోలా త్రుళ్ళి పడింది ఊర్మిళ. ఆ మంత్రం కర్ణభేరీలను స్పృశించి, మెదడుకు ప్రాకి, హృదయ పీ ఠంలో ప్రతిష్టించబడి అక్కడేదో దివ్య జ్యోతి దర్శనమైంది.

ఆ ఆలయమంతా ఊగిపోతున్న అనుభూతి. మరుక్షణం కుప్పలా నేల మీద అచేతనంగా పడిపోయింది.

ఆచారిగారు కంగారుపడలేదు. తీర్థం గిన్నెలోని తీర్థం ఆమెమీద చిలకరించారు.

‘నువ్వు ధన్యురాలివి తల్లీ! దివ్యానుభూతిని అతి చిన్న వయసులో పొందగలిగావు’ అని మాత్రం లోలోపల అనుకున్నారు. దైవానికి నమస్కరించారు.

రెండు మూడు నిముషాలలో ఊర్మిళ బాగా తేరుకుంది. లేచి కూర్చుంది.

దీపారాధన వెలుగులో స్వామి పూలతేరు మీద ఉన్నట్లున్నాడు. పెదనాన్న వాత్సల్యం నిండిన చూపులతో తనకేసి చూస్తున్నారు.

“పెదనాన్నా!” అంది.

“ఏమీ లేదమ్మా! మంత్రోపదేశ సమయంలో పరిణితి చెందిన శిష్యునికి యిలాటి దివ్యస్థితి కలుగుతుంది ఒక్కొక్కసారి. మరేం ఫర్వాలేదు. ఈ అష్టాక్షరి సర్వ బంధాలనూ తొలగించి సంసార సాగరాన్ని దాటిస్తుంది. సర్వ పాపాలనూ ప్రక్షాళనం చేస్తుంది. సర్వ ఈప్సితాలనూ నేరవేస్తుంది. నడుస్తూ, తింటూ, తాగుతూ, నిద్రిస్తూ కూడా ఇది జపించుకోవచ్చు. స్త్రీలు బహిష్టు సమయంలో కూడా ఇది జపించవచ్చు. మంత్రానికి ‘అశుచి’ లేదు. మనసు నిర్మలంగా వుంచుకోవాలి అంతే! పద బయట మంటపం దగ్గర కూర్చుందాం” అన్నారాయనగారు.

ఇద్దరూ వచ్చి కూర్చున్నారు.

“ఈ రోజెందుకో రామాయణంలోని ఊర్మిళ పాత్ర గుర్తుకొస్తోంది ఊర్మిళా నాకు. నిజానికి ఆ పాత్రంటే నాకు చాలా గౌరవం. ఆ పాత్రని తలచుకుంటే నాకెంతో ఆవేదన కలుగుతుంది.

నీ నామకరణం సమయంలో మీ నాన్న నన్నడిగాడు. “పేరేం పెడదాం అన్నయ్యా నా పాపకి?” అని.

టక్కున చెప్పేశాను ‘ఊర్మిళ’ అని. మీ పెద్దమ్మ వేళాకోళం చేసింది. “మరిది గారికి మరో ఇద్దరు కూతుళ్ళు పుడితే మాండవి, శ్రుతకీర్తి అని పెడతారా ఏమిటి?’ అని. నేను నవ్వి వూరుకున్నాను.

ఊర్మిళంటే నాకెందుకో చాలా అభిమానమని చెప్పాను కదమ్మా. ఆదికవి వాల్మీకిని తప్పు పట్టను. ఆ కవి భారత జాతికి ఇచ్చిన రామాయణ మహా కావ్యాన్ని కించపరచను. రామాయణ మహా కావ్యగానం, రామనామ జపం ఈ భారతదేశంలో ఏ రూపంలోనో ఓ రూపంలో కథలు, నాటికలు, యక్షగానాలు, వీధి భాగవతాలు కవిత్వాలు ఇలా వివిధ రూపాలలో ప్రతిధ్వనిస్తూనే వుంటుంది. అలా జరగని నాడు భారత దేశమే వుండదు. అయితే అంతటి మహత్తర కావ్యాన్ని రచించిన ఆదికవి వాల్మీకికి ... చేతులెత్తి మొక్కుతాను. జాతికి సంస్కృతి నిచ్చినవాడు. జాతి మనుగడకి జీవం పోసినవాడు. మనిషికీ పశువుకీ, దేవుడికీ దానవుడికీ, పరిపూర్ణ మానవత్వానికీ రాక్షసత్వానికీ అక్షరరూపంలో అమృత శ్లోకాలలో తేడా చూపి, మానవాళి నిజమైన కర్తవ్యం ఏదో బోధించిన వాడాయన. సీత పాత్రని చరిత్రలో మర్చి పోకుండా నిలిపిన మహానుభావుడాయన.

కానీ, కానీ ఎంచేతో ఆయన హృదయంలో ఊర్మిళ పాత్ర పట్ల ఉదాసీనతో లేక మరపో ఏర్పడింది.

సీత చరిత్ర వున్నంతకాలమూ ఊర్మిళ చరిత్ర వుండవలసిందే. ఆదికవి పట్టించుకోని ఊర్మిళ ఉనికిని కవులెందరో ఆమె నిద్రలో నిలిపారు.

ఊర్మిళ ఒకానొక చైతన్య రాహిత్య స్థితిలో ఉందనే సత్యాన్ని ఆమె నిద్ర రూపంలో ప్రతిబింబింప జేశారు.”

వింటున్న ఊర్మిళకు ఒక్కసారిగా తను హిందీ పరీక్షలకి చదువుతున్నరోజులు గుర్తొచ్చాయి. ఓ వేపు స్కూల్లో చదువుతూనే మరోవేపు హిందీ క్లాసులకు వెళుతూ, ‘విశారద’ పాస్ అయింది. మైదిలీ శరణ గుప్త అనే కవి కూడా సరిగ్గా ఇలాగే ఊర్మిళ పట్ల అపరిమితమైన ఆవేదనకు లోనయ్యాడు. ‘ఊర్మిళ’ అనే కావ్యమే వ్రాశాడాయన హిందీలో. రాష్ట్రభాషా ప్రవీణలో కాబోలు ‘ఊర్మిళాకీ నిద్ర’ అనే ఖండ కావ్యం కొంతా, ఊర్మిళ, లక్ష్మణుల పరస్పరానుగాన్ని ప్రతిఫలించే మరో కవితా ఉండేవి. అవి చెబుతూ హిందీ మాష్టారు కామేశ్వరరావు గారు కూడా ఇలాగే ఆ పాత్రని అత్యంత ఉన్నతంగా వర్ణించేవారు. ఆ పాత్ర ముద్ర తనమీదా కొంత వుంది. ఊర్మిళ పాత్ర ఆధారంగా ఏదో కథో, నవలో వ్రాయాలనే తపన కలిగేది. ఏవో పిచ్చి పిచ్చి కావ్యాలు వ్రాస్తుండేది. ఆ వాక్యాలు చూచిన మేష్టారు నవ్వి అన్నారు.

"నీలో రచనా శక్తి ఉందమ్మా ఊర్మిళా! అయితే అదింకా స్పుటంగా లేదు. మరి కొంత హృదయ పరిణితీ, జీవితానుభవమూ వచ్చిన నాడు ఈ నీలోని రచనాశక్తి బహిర్గతం అయి తీరుతుంది" అని.

ఈ రోజు పెదనాన్న ఊర్మిళ గురించి చెబుతుంటే, మరలా అలాగే ఊర్మిళ కధ ఆధారంగా ఏవేవో కొన్ని కొత్త పాత్రలని సృష్టించి కధ రాయాలనిపిస్తోంది.

"అలా కొత్త పాత్రల సృష్టి చేసి వ్రాస్తే తప్పా పెదనాన్నా?" అంది ఊర్మిళ తనలో కలిగిన భావాలు ఆయనకి చెబుతూ.

"లేదమ్మా! ఏ సాహిత్యమైనా కల్పనకు ఎక్కువగానే ప్రాధాన్యత యిస్తుంది అయితే మూలం దెబ్బ తినకూడదు. మూలంలోని ధ్యేయం సడలి పోకూడదు, అంతే. ఊర్మిళ పాత్రే తీసుకో. ఆమె లక్ష్మణస్వామిని ప్రాణాధికంగా ప్రేమించింది. భర్త తప్ప మరో ఆలోచన ఎరుగని అమాయకురాలు. ఒక్కసారిగా భర్తను వదిలి పధ్నాలుగేళ్ళు వుండటం అన్న మాట వినగానే ఆమె మూర్చిల్లింది. ఆ మూర్చనే నిద్రగా పధ్నాలుగేళ్ళు కొనసాగించి ఉండవచ్చునని కవులు ఊహాగానాలు చేశారు. పధ్నాలుగేళ్ళు మరణం కాని నిద్ర అసంభవమన్నారు మరికొందరు. ఊర్మిళ అన్నేళ్ళు నిద్ర పోయినట్లు రామాయణంలో అసలు ఆదికవి వ్రాయనే లేదు. ఏది ఏమైనా ఊర్మిళ గడిపిన ఆ పధ్నాలుగేళ్ళ కాలమూ ఆమె ఒకానొక చైతన్య రాహిత్య స్థితిలోనే గడిపిందనటానికి ఏలాటి సంశయమూ లేదు."

"అవును పెదనాన్నా! మరి అహల్య? రాయి అయి పోయిందంటావా?' అంది కుతూహలంగా.

"రాయిగా మారలేదమ్మా. రాయిలాటి మనస్థితిలో పడి పోయిందంతే. ఆమె తప్పే చేసింది. భర్తను వచించింది. బుద్ధిపూర్వకంగానే ఇంద్రునితో వ్యభిచరించింది. కానీ ఆమెనా స్థితికి తెచ్చిన ఆ సమాజం మాటేమిటి?

అపురూప లావణ్యమూర్తి చైతన్య స్రవంతి అయిన అహల్య అస్తమానూ జపతపాలలో, యజ్ఞ యాగాలలో మునిగి వుండే గౌతముని ఇల్లాలయ్యింది. కేవలం 'యుక్తి' కారణంగా మాత్రమే ఇల్లాలైంది. అరణ్యంలో కందమూలాల ఆహారంతో కఠిన నియమాలలో భర్త సేవలో, బలవంతపు వైరాగ్యంలో తనని తాను కఠిన శిలలా మార్చుకుంది. మలచుకుంది. కానీ ఒకానొక ఝంఝూమారుతం వీచింది. ఆ శిలలో మరిచి పోయిన చైతన్యం మేల్కొంది. ఇంద్రుని రూప లావణ్యాలు భోగాభాగ్యాలే గాక, బలవంతంగా అణచుకున్న యవ్వనం తాలూకు కోర్కెలు ఆమెని ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఆమె తప్పని తెలిసే తప్పు చేసింది.

ఫలితంగా గౌతము డామెను బహిరంగంగా విచారించి, శిలా సదృశంగా పడివుండమని ఆజ్ఞాపించి, ఆమెను వెలివేసి వెళ్ళిపోయాడు. ఋషి సమాజం ఆమె తప్పును పదే పదే గేలి చేసి ఉండవచ్చు. పొడిచి పొడిచి మానసికంగా

ఆమెని చిత్రవధకు గురిచేసి ఉండవచ్చు. అందరి మధ్యా ఆమె అవామానాగ్నిలో దహింపబడి, పశ్చాత్తాపంతో కృంగి పోయి తనమీద తనక్కలిగిన జాలితో అసహ్యంతో ఘనీభవించి ఆమె హృదయం మొద్దుబారిపోయి ఉండవచ్చు. శిలలా ధూళిలో ఒంటరిగా రోజులు, నెలలు, సంవత్సరాలు గడిపిందామె.

భర్త చేత శిక్షింపబడి, సమాజం చేత వెలివేయబడి, శిక్షింపబడిన స్త్రీగా ఆమె చైతన్య రాహిత్య స్థితిలో శిలలా మిగిలిపోయింది.

శ్రీరామచంద్రుడు శివ ధనుర్భంగానికి వెళుతూ, అహల్య పడివున్న ప్రదేశానికి వచ్చాడు, విశ్వామిత్రుల వెంట. జీవచ్ఛవంలా వుండి, తన ఒంటరితనాన్ని మర్చిపోవటానికి, తన పశ్చాత్తాపాన్ని వెల్లడించుకోవటానికి ఏకైక మార్గంగా ఎన్నుకున్న భగవన్నామంలో తనని తాను మరచిన అహల్యను చూసాడు.

విశ్వామిత్రుని ద్వారా ఆమె కథ విననూ విన్నాడు. మానవులలో క్షణికావేశాలనూ, బలహీనతలనూ, దేవ దానవ గుణాలనూ చూపు మాత్రంతో అంచనా వేయగల శ్రీరామచంద్రునికి అహల్య యొక్క దీనావస్థ అవగతమైంది. ఆయన హృదయం కరిగి నీరైంది.

పురుషుని విచ్చలవిడితనాన్ని, బహు భార్యాత్వాన్నీ, వృద్ధులై పెళ్ళాడే మునుల్నీ సమర్థించే ఆనాటి సమాజంలో అహల్య పొరబాటుగానో గ్రహపాటుగానో తప్పు చేసింది. ఇక ఆ తప్పుకి, 'క్షమ' అన్నది లేదా? అని తల్లడిల్లి పోయాడా పరిపూర్ణ మానవుడు.

ఉప్పొంగే మానవతా దృక్పథంతో, మాతృ సమానురాలైయిన అహల్యను, సంవత్సరాల తరబడి ఒకానొక చైతన్య రాహిత్య స్థితిలో వుండి పోయిన శిలలాటి అహల్యను... తన తప్పుని తానే చెప్పుకుని, 'నాకిక విముక్తిలేదా?' అని పాదాల మీద వాలిన అహల్యను వాత్సల్యంతో స్పృశించి, 'జరిగింది జరిగి పోయింది. గతం మర్చి పో. కొత్త జీవితం ఆరంబించు" అనే శీతల స్పర్శతో చేయూత యిచ్చి, తిరిగి ఆమెలో చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని యిచ్చాడు శ్రీరాముడు.

తర్వాత గౌతముడు ఆమెను స్వీకరించటం, ఏదో కథ వుంది.

కానీ, ఊర్మిళా! శ్రీరాముడు చేసింది ఓ స్త్రీకి ఆత్మ విశ్వాసం ఇవ్వటం. నాకర్థమైంది అంతవరకే. అడుగడుగునా ఆదికవి వాల్మీకి ప్రతి పాత్ర ద్వారా ఒక్కో నీతినీ, ఆదర్శాన్నీ మన జాతికి అందించాడమ్మా" అన్నారాయన ఆవేశంగా.

ఊర్మిళ అలాగే ఆలోచిస్తూ కూర్చుండి పోయింది.

"ఆ పాత్రలే మళ్ళీ మళ్ళీ పునరావృత మౌతున్నాయి చరిత్రలో. అయితే కొత్త మార్పులు, కొత్త చేర్పులు, కొత్త సమాజం, కొత్త సమస్యలు... పోనీమ్మా! మంత్రం మాత్రం ఏమరక జపించు" అన్నారాయనగారు.

"పెదనాన్నా!"

"ఏమిటి తల్లీ?"

"మంత్రోపదేశానికి, దీక్షకూ చాలా తంతు వుందని అమ్మ చెబుతుండేది. మరి మీరేమో యిలా నిరాడంబరంగా ఆలయ గర్భగుడిలో మంత్రోపదేశం చేశారేమిటి నాకు?" ఇందాకట్నించీ అడగాలనుకుంటున్న ప్రశ్న అడిగేసింది ఊర్మిళ.

ఆచారిగారు నవ్వారు.

"అమ్మా! బాహ్యాడంబరాలకు విలువ యిచ్చే గురు శిష్యులైతే మంత్రోపదేశానికి షుమారు వెయ్యి నుండి ఐదువేల రూపాయల వరకూ ఖర్చు పెట్టి నానా హంగామా చేస్తారు. తిరుమంత్రోపదేశమూ, ముద్రాంకితాలూ, పట్టుబట్టలూ, గురుదక్షిణ ఇదంతా హడావుడి.

శిష్యులలో కొందరికి అంత హడావుడి చేస్తే తప్ప తాము మంత్రోపదేశం పొందామన్న తృప్తీ, మంత్రం మీద గురీ కలగవు. అంటే అది కనిపెట్టిన గురువులలా చేస్తారు. కొందరు దొంగ గురువులు దండిగా డబ్బి లాగే పద్ధతిలోనూ చేస్తారలా.

హృదయ పరిపక్వత గల గురు శిష్యులకు మంత్రోపదేశానికి ఏ ఆడంబరమూ అవసరం లేదమ్మా."

ఊర్మిళ ఇంటికి వచ్చేసింది. సంక్రాంతి వెళ్ళిన మూడోరోజు సీతని పెళ్ళిచూపులు చూచేందుకు, అన్నీ కుదిరితే పెళ్ళి సంబాషణలు మాట్లాడుకొనేందుకు హైదరాబాదు నుంచి ఓ సంబంధం వస్తున్నట్లు ఉత్తరం వచ్చిందని పెద్దమ్మ చెప్పింది ఊర్మిళతో సంతోషంగా.

చాలా సంతోషించింది ఊర్మిళ. రామచంద్రం తమ ప్రక్కనే వున్నాడన్న ధ్యాస ఆ తండ్రీ కూతుళ్ళిద్దరికీ కలగనే లేదు ఇందాకా

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments